


# జవాబు తెలిసిన ఆకలి

-కె.లక్ష్మీకాంతమ్మ

సదానందం నా చిన్ననాటి మిత్రుడు. సుమారు నాలుగేళ్ల తరువాత కలిశాడు. కానీ, అతని పరిస్థితి ఏమీ బాగా లేదు. ఏవో కారణాల వల్ల పెళ్ళి చేసుకోలేదట. నిరుద్యోగం బాధ. ఇల్లంటూ లేదు. ఊరొదిలి పట్నం వచ్చాడు. నాలుగు రోజులుగా కడుపునిండా తిండి తినలేదట- బాగా నీరసంగా వున్నాడు. చాలా జాలేసింది.

దురదృష్టవశాత్తు ఆ సమయంలో నా దగ్గర కూడా డబ్బు ఎక్కువగా లేదు. నేను చేసేది చిన్న ప్రైవేటు ఉద్యోగం. వచ్చే జీతంతో సంసారం ఈదడమే మహా కష్టంగా వుంది.

జేబులో పదిహేను రూపాయలున్నాయి. రూపాయి బిళ్ళలు మరో మూడు వున్నాయి. కనీసం అతనికి ఒక పూట భోజనం పెట్టించగలిగే స్థితిలో వున్నందుకు కొంచెం సంతోషం కలిగింది.

సదానందుని స్టోన్‌హౌస్‌పేటలోని నాకు తెలిసిన శ్రీకనకదుర్గ హోటల్‌కు తీసుకెళ్లాలనుకున్నాను.ఆ మాటే అన్నాను కూడా!

"ఆ హోటలుకా..వద్దు..వద్దు..మరో హోటల్‌కి వెళ్దాం" అన్నాడు గాబరాగా.

"ఏం అక్కడ పదార్థాలు బాగుండవా?" అన్నాను ఆశ్చర్యంగా. నిజానికి అక్కడ నేను గతంలో చాలాసార్లు భోజనం చేశాను. బాగానే వుంది మరి.

"ఆ చాలా బాగుంటాయ్. కానీ నడుచుకుంటూ..అలా అలా వెళ్దామనీ.." అంటూ నసిగాడు. సరేనని..కొద్దిదూరం నడిచి 'విజయ హోటల్' వైపు నడిపించాను.

"ఇక్కడా వద్దు.." అన్నాడు మళ్ళీ. విచిత్రంగా చూశాను. నా చూపుని అతను గమనించాడు. తలదించుకున్నాడు.

"మరెక్కడ నీకు నచ్చుతుంది?" అని అడిగాను నాకేమీ అర్థంకాక.

"ఎక్కడంటే..అదీ..బస్టాండ్ దగ్గర.."

"బస్టాండా..అది ఇక్కడి నుండి రెండు కిలోమీటర్ల అవతల ఉంది తెలుసా?" అన్నాను.

"అవును..దూరమేననుకో..కానీ, అక్కడయితే భోజనం బాగుంటుంది" అన్నాడు సదానందం తలతిప్పి ఎటో చూస్తూ.

నాకు అంతదూరం నడిచే ఓపిక లేదు.

"సరే- ఈ డబ్బులు తీసుకుని నీ పాట్లేవో నువ్వు పడు" అని డబ్బులు అతనికిచ్చి తిన్నగా ఇంటికి వచ్చేశాను.

కానీ, ఇంటికి తాళం వేసి వుంది. పక్కింటి వాళ్ళు చెప్పారు. "మీ చెల్లెలు ఇందుకూరుపేట నుండి వస్తే, తనతో సినిమాకెళ్ళింది మీ ఆవిడ. మిమ్మల్ని భోజనం బయిటే చేయమంది" అని.

హతోస్మి... మా ఆవిడ సిన్మా అంటే చాలు మిగతా విషయాలు అన్నీ వదిలేసి వెళ్లిపోతుంది.

అదొక్కటే ఆమె బలహీనత. అదీగాక చిరంజీవి సినిమా కొత్తహాలులో ఆడుతున్నది. ఆ సిన్మా అంటే ఈమెకు మహా ఇష్టం. పోరుపెట్టయినా మరీ చెల్లెల్ని తీసుకెళ్లి వుంటుంది.

సరే ..ఇప్పుడే హోటలుకి వెళ్ళాలి? దానికో ఇరవై రూపాయలు తగలబెట్టాలి. కానీ, తప్పదు. నాకు వండుకోవడమంటే మహా చిరాకు.

చేసేదేముంది..తాళం తీసి బీరువాలో ఉన్న డబ్బులు తీసుకున్నాను. తాళం వేసి బయటకొచ్చి సైకిల్ ఎక్కాను. అప్పుడనిపించింది. సదానందం చెప్పిన ఆర్‌టిసి దగ్గర హోటల్‌కి వెళితే సరి. అతనూ నడుస్తూ ఈసరికి చేరుకుని వుంటాడు. మాట్లాడుకుంటూ తినొచ్చు. లేని ఓపిక తెచ్చుకుని సైకిల్ని పోనిచ్చాను. హోటల్ ముందు సైకిల్ స్టాండు వేసి లోనికెళ్లాను. లోపల ఏదో గొడవ జరుగుతున్నట్లుంది. ఆసక్తిగా అటువైపు చూశాను.

సదానందం ఒక సప్లయర్ కుర్రాడిపై అరుస్తున్నాడు.

"నా ఇష్టం- నువ్వేంటి చెప్పేది. నోరుమూసుకో.."

సప్లయర్ ఆవేశంగా "ఏంటి మూసుకునేది..ముంతకింద పప్పు- తినేది ప్లేటు సాదా రైస్- కూరలు మాత్రం అరకిలో చొప్పున లాగిస్తావా? చూడండీ! నాలుగు గిన్నెల్లో నిండుగా కూరలు తెచ్చాను. గిన్నెల్లోని కూరలన్నీ లాగించేశారు. ఇలా అయితే వ్యాపారం నడిచినట్లే.." అంటూ ఖాళీ గిన్నెల్ని జనానికి చూపిస్తున్నాడు సప్లయర్ భుజం మీది టవల్‌తో ముఖం రుద్దుకుంటూ!

సదానందం వదనం కాంతి విహీనమైపోయింది. అందరూ అతన్ని అసహ్యంగా చూస్తున్నారు. అనుకోకుండా సదానందం నావైపు చూశాడు. నేను సదానందం కళ్లల్లోకి చూడలేక తలదించుకుని చప్పున వెనక్కు తిరిగాను.వడివడిగా హోటలు బయటికి నడిచాను. ఇంతకీ, నాకర్థం కానిది ఒకటుంది.. సదానందం తప్పు చేశాడా?! అయితే నేనెందుకు సిగ్గుపడ్డాను!?

జవాబు ఆకలికి మాత్రమే తెలుసనుకుంటా!!

★